తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 88 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ ఆదివారం 3-11-2024 వెల: 5/రూ -


# ఫోర్త్‌సిటీకి మెట్రో

**రూ.8,000 కోట్లతో 40 కిలోమీటర్ల నిర్మాణం**

రెండోదశ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

**రూ. 24,269 కోట్లతో పరిపాలన అనుమతులు**

ఐదు కారిడార్లు.. 76.4 కిలోమీటర్లు

**ఆరో కారిడార్‌గా ఫోర్త్‌సిటీకి మెట్రో కనెక్టివిటీ**

మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.32,237 కోట్లు

**కేంద్రంతో కలిసి 50:50 విధానంలో జాయింట్ వెంచర్ ప్రాజెక్టు**



హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశ పనులకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. రెండోదశ ప్రాజెక్టులో భాగంగా రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కిలోమీటర్ల మేర ఐదు కారిడార్ల (పార్ట్-ఏ కింద)ను నిర్మించనున్నారు. పార్ట్-బీలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ)వరకు ఆరో కారిడార్‌ను నిర్మించనున్నారు.

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశ పనులకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. రెండోదశ ప్రాజెక్టులో భాగంగా రూ. 24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కిలోమీటర్ల మేర ఐదు కారిడార్ల (పార్ట్%-ఏ కింద)ను నిర్మించనున్నారు. పార్ట్%-%బీలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ)వరకు ఆరో కారిడార్‌ను నిర్మించనున్నారు. దీనికి రూ. 8 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికి సంబంధించిన అలైన్‌మెంట్, నిర్మాణ వ్యయం ఇతర అంశాలపై సర్వే జరుగుతోంది. ఈ మేరకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండోదశ మెట్రో ప్రాజెక్టును దేశంలోని ఇతర నగరాల తరహాలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి 50:50 జాయింట్ వెంచర్ (జేవీ)గా నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం నడుస్తున్న 69 కిలోమీటర్ల తొలిదశ మెట్రోరైలు ప్రపంచంలోనే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించిన అతిపెద్ద ప్రాజెక్టు. ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల రెండోదశ మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణానికి అంచనా వేసిన రూ. 24,269 కోట్లలో

2లో



## పక్షం రోజుల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

**5న లేదా 6న ప్రక్రియ ప్రారంభిస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

రాజకీయ జోక్యం లేకుండా యాప్ ద్వారా ఎంపిక

ఇంటి పునాదుల నుంచి పూర్తయ్యేదాకా దశలవారీగా సొమ్ము విడుదల

అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెడతామని వెల్లడి

ఈ టర్మ్ అంతా రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని వ్యాఖ్య

2లో



## చిరంజీవితో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భేటీ

2లో

## నూరు శాతం వర్సిటీల ప్రక్షాళన


నూతన వీసీలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టీకరణ

వర్సిటీల్లో వ్యవస్థలు దెబ్బతిన్నాయని..

వాటిపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని వ్యాఖ్య

వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో

అధ్యయనం చేయాలని దిశానిర్దేశం



హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను నూరు శాతం ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొంతకాలంగా యూనివర్సిటీలపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని.. వాటిల్లోని పలు వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

2లో



## జనవరి 15 నాటికి గుంతలు లేని రోడ్లు

**860 కోట్లతో రాష్ట్రమంతా మరమ్మతులు**

అనకాపల్లి జిల్లా వెన్నెలపాలెంలో గుంతలు లేని ఏపీ మిషన్ ప్రారంభించిన సీఎం

ప్రతి నియోజకవర్గంలో అన్న క్యాంటీన్: చంద్రబాబు

అనకాపల్లి: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే అభివృద్ధికిచిహ్నాలైన రోడ్లు అధ్వానంగా మారాయని, రూ. 860 కోట్లతో మరమ్మతులు చేపట్టి వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఉండేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## ఈనెల 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు



## నా సలహా ఖరీదు 100 కోట్లు!

పార్టీల నుంచి తీసుకునే ఫీజు ఇదీ

కొన్నిసార్లు ఇంతకంటే ఎక్కువే..

దీంతో రెండేళ్లు పార్టీ నడపగలను

నా వ్యూహాలతో 10 ప్రభుత్వాలు

సివిల్‌కోడ్‌పై ప్రజాభిప్రాయం ముఖ్యం

జన్ సురాజ్ పార్టీ కన్వీనర్ ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలు

## త్వరలో ఏపీకి భారీగా పెట్టుబడులు

మంత్రి నారా లోకేశ్ టూర్ సక్సెస్

వారం రోజులపాటు అమెరికాలో పర్యటించిన లోకేశ్



అమరావతి, నవంబర్ 2 : రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది. గత వారం రోజులుగా అమెరికాలో మంత్రి పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా లోకేష్ అమెరికా పర్యటన కొనసాగింది. వారం రోజుల పర్యటనలో 100కు పైగా దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుసగా భేటీ అయ్యారు. పరిశ్రమదారుల్లో నమ్మకం కలిగించడంలో మంత్రి సక్సెస్ అయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను ఆవిష్కరించారు.

# నూరు శాతం వర్సిటీల ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

వర్సిటీల గౌరవాన్ని పెంచాల్సిన బాధ్యత వైస్ చాన్స్‌లర్లపైనే ఉందన్నారు. ఇటీవల నియమితులైన వివిధ యూనివర్సిటీల వీసీలతో సీఎం రేవంత్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ, సామాజిక సమీకరణాల ఆధారంగానే విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్లను ఎంపిక చేశామని.. ఈ ప్రక్రియలో ఎలాంటి ప్రభావితాలు లేవన్నారు. వర్సిటీల్లో దెబ్బతిన్న వ్యవస్థల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలని వీసీలకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకొని అధ్యయనం చేపట్టి నివేదిక రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

**స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోండి..**

'గతంలో వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తుపెట్టుకొనేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా ప్రభుత్వం మీకు స్వేచ్ఛ ఇస్తోంది. మంచిపనులు చేసేందుకు సొంతంగా నిర్ణయాలు తీసుకోండి. బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి. తప్పు జరిగితే మాత్రం ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. వర్సిటీల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టిపెట్టండి. విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ కౌన్సెలింగ్ ఇవ్వండి' అని సీఎం రేవంత్ వీసీలకు సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

# నా సలహా ఖరీదు 100 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)



పట్నా: ఎన్నికల వ్యూహకర్త, బిహార్‌లోని జన్ సురాజ్ పార్టీ కన్వీనర్ ప్రశాంత్ కిషోర్ తాను వసూలు చేసే ఫీజు ఎంతో వెల్లడించారు. దేశంలోని పలు రాజకీయ పార్టీలకు వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిషోర్ వాటికి తానందించిన సేవలకుగానూ తీసుకునే ఫీజు ఎంతో ప్రకటించారు. బిహార్ ఉప ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన ప్రశాంత్ కిషోర్... తన ఫీజుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీ నిర్వహణకు తనకు డబ్బులు ఎక్కడినుంచి వస్తున్నాయని అడుగుతున్నారని, తాను ఏదైనా పార్టీకి వ్యూహకర్తగా సేవలందిస్తే అందుకు ఫీజుగా రూ.100 కోట్లు, అంతకుమించి కూడా తీసుకుంటానని చెప్పారు. వివిధ రాష్ట్రాలలో పది ప్రభుత్వాలు తన వ్యూహాలతో నడుస్తున్నాయని ప్రశాంత్‌కిషోర్ చెప్పుకొచ్చారు. తాను ఒక ఎన్నికలకు వ్యూహకర్తగా పనిచేస్తే వచ్చే సొమ్ముతో రెండేళ్లు రాజకీయ పార్టీని నిర్వహించగలనని అన్నారు. ఒక పార్టీ నుంచి వంద కోట్లు, ఆపైన తీసుకునే తాను ఆర్థికంగా బలహీనంగా ఉన్నట్లా? అంటూ ప్రశాంత్ కిషోర్ ఎదురు ప్రశ్నించారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వ్యూహకర్తగా పనిచేయడం ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రశాంత్ కిషోర్‌కు ఆ ఎన్నికలలో నరేంద్ర మోదీ విజయం సాధించడంతో తిరుగు లేకుండా పోయింది. ఆ తర్వాత 2015 ఎన్నికలలో బిహార్‌లో జేడీయూ-ఆర్జేడీ కూటమికి ప్రశాంత్ కిషోర్ పనిచేశారు. 2021లో పంజాబ్ ఎన్నికలలో కాంగ్రెసకు విజయాన్ని అందించడంలో ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు పనిచేసాయి.

## ఈనెల 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

ఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే నవంబర్ 25వ తేదీ నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కేంద్రం.. వక్ఫ్ బిల్లు ఆమోదానికి పెట్టే అవకాశం ఉంది. పార్లమెంట? శీతాకాల సమావేశాలు నవంబర్ 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. నవంబర్ 26న జాయింట్ పార్లమెంట్ సెషన్ ఉండనుంది. ఇక, డిసెంబర్ 20వ తేదీ వరకు పార్లమెంట్ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. కాగా, ఈ శీతాకాల సమావేశాల్లోనే వక్ఫ్ బిల్లుకు ఆమోదానికి పెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం.

## చిరంజీవితో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భేటీ

హైదరాబాద్: సినీహీరో చిరంజీవితో కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. శనివారం చిరంజీవి నివాసానికి వెళ్లిన సందర్భంగా ఆయన్ను కిషన్‌రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. దీపావళి సందర్భంగా చిరంజీవికి శుభాకాంక్షలు తెలియజేసినట్లు 'ఎక్స్' ద్వారా కిషన్‌రెడ్డి వెల్లడించారు. సినీపరిశ్రమతో పాటు సేవా కార్యక్రమాలతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచి ప్రభావితం చేసిన చిరంజీవిని కలుసుకోవడం ఎల్లప్పుడూ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తుందని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే కిషన్‌రెడ్డి చిరంజీవిని మర్యాదపూర్వకంగానే కలుసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## జనవరి 15 నాటికి గుంతలు లేని రోడ్లు

(మొదటి పేజీ తరువాయి)

దీనికోసం రూ. 860 కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు. శనివారం అనకాపల్లి జిల్లా పరవాడ మండలం వెన్నెలపాలెంలో నిర్వహించిన గుంతల రహిత ఏపీ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. పరవాడ-అచ్యుతాపురం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చే పనులకు ముఖ్యమంత్రి కొబ్బరికాయ కొట్టారు. పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం స్వయంగా పొక్లయినర్ ఎక్కి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు. ఐదేళ్లలో రోడ్లపై గుంతలు పెట్టడమే కాకుండా రాష్ట్రానికి అనేక రంగాల్లో గోతులు తవ్వారంటూ.. పరోక్షంగా మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు విమర్శనాస్త్రా లు గుప్పించారు. గత ఐదేళ్లలో రోడ్లకు కేవలం రూ.1000 కో ట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు.



# గడ్డమీది జంగా గౌడ్‌కు కాకతీయ మహానంది పురస్కారం

**తెలంగాణ ప్రతినిధి నవంబర్02(డైలీ రిపోర్ట్):** కాకతీయ మహానంది పురస్కారం అంజలి వీడియో గ్రూప్ అందరి టీవీ 10 వ వార్షికోత్సవం సందర్భంగా పురస్కారం అందుకున్న జంగా గౌడ్.నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణం పబ్లిక్ గార్డెన్ హన్మకొండలో సామాజిక సేవకుడిగా మహానంది పురస్కారాన్ని స్వీకరించిన సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దు మైలారం గ్రామానికి చెందిన గడ్డమీది జంగా గౌడ్. కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా సంఘ సేవ చేస్తూ కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవనే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఆపదలో ఉన్నవారికి పిలువగానే నేనున్నాను అంటూ పలికే మహోన్నత వ్యక్తిగా ప్రముఖుల ప్రశంసలతో పాటు పలు అవార్డులు అందుకున్న గడ్డమీది జంగా గౌడ్ తన వంతు సహాయంగా ఎవరికి ఏ ఇబ్బందులు ఉన్న తనకు తోచినంతగా ఆదుకొని సహాయ సహకారాలు అందిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు



సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటున్నా గడ్డమీద జంగా గౌడ్ కి అంజలి వీడియో గ్రూప్ మరియు అందరి టీవీ ఆధ్వర్యంలో 10 వ వార్షికోత్సవం సందర్భంగా కాకతీయ మహానంది పురస్కారాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గడ్డమీద జంగా గౌడ్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ కష్టంలో ఉన్నవారికి మన వంతు సాయం అందిస్తే భగవంతుని సేవ చేసినట్టే మనుషులలోపన్నే భగవంతుడు ఉంటాడు కష్టంలో ఉన్నవారికి ఎప్పుడూ మనం మన వంతు మనకు ఎంత కలిగితే అంతా మనకు తోసిన విధంగా సహాయం అందించాలని పిలుపునిచ్చారు. అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అని నమ్మే నేను అదే మార్గంలో నడుస్తున్నాను అన్నారు. కాకతీయ మహానంది పురస్కారాన్ని అందుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ పురస్కారాన్ని అందించిన అంజలి గ్రూప్ మరియు అందరి టీవీ వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపినారు.

# ఫోర్త్‌సిటీకి మెట్రో

తెలంగాణ ప్రభుత్వం వాటా రూ. 7,313 కోట్లు (30 శాతం) కాగా, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.4,230 కోట్లు (18 శాతం), జపాన్ ఇంటర్నేషన్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా), ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) మొదలైన ఆర్థిక సంస్థల వాటా రూ.11,693 కోట్లు (48 శాతం), మరో 4 శాతం అంటే రూ.1,033 కోట్లను పీపీపీ విధానం ద్వారా సమీకరిస్తారు. ఫోర్త్‌సిటీ మెట్రో కనెక్టివిటీకి రూ.8 వేల కోట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ లైన్ కోసం అనేక ఆకర్షణీయ ఫీచర్లతో వినూత్న రీతిలో డీపీఆర్ తయారు చేస్తున్నట్లు పురపాలక శాఖ తెలిపింది. ఈ కొత్త లైన్ డీపీఆర్ మినహా మిగిలిన ఐదు కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని అధికారులు తెలిపారు. ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీకి సుమారు రూ.8,000 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో మొత్తం రెండో దశ ప్రాజెక్ట్ కు అయ్యే వ్యయం దాదాపు రూ.32,237 కోట్లు (రూ.24,237 కోట్లు ం రూ. 8,000 కోట్లు)గా అవుతుంది.

మెట్రో రైల్ రెండో దశ డీపీఆర్‌ల రూపకల్పనపై సీఎం రేవంత్ రెడ్డి కొద్ది రోజుల క్రితం పురపాలక శాఖ సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి మెట్రో రెండో దశ కారిడార్‌ల అలైన్‌మెంట్, స్టేషన్లు, ఇతర ముఖ్యమైన ఫీచర్లు తదితర అంశాల గురించి ప్రెజెంటేషన్ ఇచ్చారు. హెచ్ఎండీఏ కోసం సిద్ధం చేస్తున్న సమగ్ర మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక తరువాత డీపీఆర్‌లకు తుదిరూపం ఇచ్చారు. మెట్రో మార్గాల్లో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్%-%చెక్ చేయాల్సి ఉంటుంది. కేంద్రానికి డీపీఆర్‌లను సమర్పించడానికి ఈ అధ్యయనం తప్పనిసరి. దీంతో మెట్రో అలైన్‌మెంట్‌లు, స్టేషన్లు ఇతర అంశాలపై పూర్తిస్థాయిలో సర్వే చేసి, నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఆ డీపీఆర్‌లకు సీఎం ఆమోదం తెలిపారు. కాగా గతంలో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయించిన ప్రకారం ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ ను ఇప్పుడు ఆరామ్‌ఘర్, 44వ నెంబర్ జాతీయ రహదారి (బెంగళూరు హైవే)లోని కొత్త హైకోర్టు ప్రాంతం మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునేలా ఖరారు చేశారు.

**ఐదు కారిడార్‌ల అలైన్‌మెంట్‌లు ఇలా..**

కారిడార్ %-%4 (ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్): నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు దాదాపు 36.6 కి.మీ. ఎల్‌బీ నగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ హాస్పిటల్, డీఆర్‌డీఓ, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరామ్‌ఘర్, న్యూ హైకోర్టు, శంషాబాద్ జంక్షన్ ద్వారా జాతీయ రహదారి మీదుగా ఈ మార్గం ఉంటుంది. ఇది నాగోల్, ఎల్‌బి నగర్, చంద్రాయన్ గుట్ట వద్ద ఉన్న అన్ని మెట్రోలైన్‌లకు అనుసంధానం చేయబడుతుంది. 36.6 కి.మీ పొడవులో 35 కి.మీ పిల్లర్ల మీద (ఎలివేటెడ్ ), 1.6 కి.మీ మార్గం భూగర్భంలో వెళ్తుంది. విమానాశ్రయం వద్ద భూగర్భ స్టేషన్ ఉంటుంది. ఈ మార్గంలో మొత్తం 24 స్టేషన్లు ఉంటాయి

**కారిడార్ 5:** రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట నియోపోలిస్ వరకు వరకు ఈ మార్గం ఉంటుంది. బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట నియోపోలిస్ వరకు నిర్మిస్తారు. ఇది మొత్తం పిల్లర్లపైనే ఉండే ఎలివేటెడ్ కారిడార్. ఇందులో 8 స్టేషన్లు ఉంటాయి.

## పక్షం రోజుల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో ప్రారంభించి పక్షం రోజుల్లో పూర్తి చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక యాప్ ద్వారా జరుగుతుందని, ఎంపికలో రాజకీయ జోక్యం ఏమాత్రం ఉండదని చెప్పారు. నిరుపేదలకు సొంతింటి వసతి కల్పించడం లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. "ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే మంజూరు చేస్తాం. 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తగ్గకుండా ఇళ్లను నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ ఇళ్లకు ప్రత్యేక డిజైన్ అంటూ ఉండదు. లబ్ధిదారులకు ఉన్న జాగా ఆధారంగా వారే కావాల్సిన ఆకృతిలో నిర్మించుకోవచ్చు. అయితే వంటగది, మరుగుదొడ్డి కచ్చితంగా ఉండేలా చూడాలి. ఇందిరమ్మ ఇళ్లకు పునాదులు నిర్మించుకున్నాక రూ.లక్ష, గోడల నిర్మాణం తర్వాత రూ.లక్షన్నర, పైకప్పునకు రూ.లక్షన్నర చొప్పున చెల్లిస్తాం. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మిగతా మొత్తం అందజేస్తాం. ఈ సొమ్మును బ్యాంకు ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా జమ చేస్తాం. తొలిదశలో కేవలం సొంత జాగా ఉన్నవారికే ఇళ్లను మంజూరు చేస్తాం. తదుపరి విడతలో భూమిలేని నిరుపేదలకు స్థలం ఇచ్చి నిధులు అందజేస్తాం. నియోజకవర్గానికి 3,500కు తగ్గకుండా ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేస్తున్నాం. నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లను నిర్మించేలా చూస్తాం. ఈ ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణ కోసం 16 శాఖల నుంచి సిబ్బందిని సమీకరిస్తున్నాం.నిధులను తొలిదశ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.20వేల కోట్ల వరకు ఖర్చవుతాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.7,740 కోట్లను కేటాయించింది. కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేందుకు ప్రయత్నిస్తున్నాం.

# త్వరలో ఏపీకి భారీగా పెట్టుబడులు

ఐదేళ్ల విధ్వంసక పాలనలో దెబ్బతిన్న బ్రాండ్ ఏపీని పునరుద్ధరించడమే లక్ష్యంగా లోకేష్ టూర్ సాగింది. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై పలు దిగ్గజ కంపెనీలు సానుకూల సంకేతాలు ఇచ్చాయి. లోకేష్ భేటీల నేపథ్యంలో జనవరిలో దావోస్‌లో జరిగే పెట్టుబడుల సదస్సులో పెద్ద ఎత్తున ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. లోకేష్ పర్యటన విజయవంతంపై ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అమెరికాలో లోకేష్ బిజీబిజీగా గడిపారు. దిగ్గజ కంపెనీలతో భేటీ అవుతూ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇది మంచి అవకాశం అంటూ పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ఈ క్రమంలో ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలు వస్తే రాష్ట్రంలో చాలా మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. జగన్ హయాంలో ఎక్కడా కూడా పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీ అభివృద్ధే లక్ష్యంగా దూసుకెళ్తోంది. అయితే జగన్ అమెరికా వెళ్లినా, ఢిల్లీకి వెళ్లినా స్వప్రయోజనాల కోసమే తప్ప రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోంచించిన పరిస్థితి లేదు. గత ఐదేళ్లలో పెట్టుబడుల ఊసే లేని నవ్యాంధ్రకు పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ మంత్రి లోకేష్ అమెరికా పర్యటన సాగింది. ప్రముఖ దిగ్గజ కంపెనీల అధిపతులతో విస్తృతంగా చర్చించారు. ఏపీలో ఏఏ రంగాలలో పెట్టుబడులకు అవకాశం ఉందో వివరించారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ పునరుద్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్ కార్లు, రియల్‌ఎస్టేట్ రంగంలోని ప్రముఖులతో సంప్రదింపులు జరిపి అమరావతి మొదలుకుని ఉత్తరాంధ్ర, గోదావరి, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే విధంగా ఆయా రంగాల్లో అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆయన పర్యటనలో సీఎంవో సంయుక్త కార్యదర్శి కార్తికేయ మిశ్రా కూడా పాల్గొన్నారు.

# నాడు నా బడి 400 మందితో కళకళలాడింది

## నేడు 40 మందితో బోరున విలపిస్తుంది






**నేడు** ఆత్మీయ సమ్మేళనాలతో అలసిపోతున్న గురువులు. నాడు ఆటపాటలతో అలరిస్తూ... విద్యాబుద్ధులు నేర్పుతూ మా భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఏనాడూ అలసటగా కనిపించలేదు. అనునిత్యం నూతన విద్యార్థిగా కొత్త కొత్త విషయాలు నేర్చుకొని అవన్నీ మాకు అందిస్తూ.... పిల్లల్లా మాతో కలిసి ఆటలు ఆడిస్తూ... పాటలు పాడుతూ.... పాడిస్తూ.... భవిష్యత్తు పాఠాలు నేర్పిన గురువులు మా పేదరిక పరిస్థితులను అర్థం చేసుకొని నోట్ బుక్కులు పెన్నులు ఉన్నా లేకపోయినా ఉన్న దాంట్లో సర్ది పెడుతూ చదువు చెప్పారు. ఊరు వీధుల్లో తిరిగి మమ్మల్ని వెతికి వెతికి పట్టుకొచ్చి తరగతి గదిలో కూర్చోబెట్టారు ఎందుకంటే మా భవిష్యత్తు అంటే వాళ్లకు శ్రద్ధ మమ్మల్ని భావి భారత పౌరులను తీర్చిదిద్దడం వల్ల బాధ్యతగా భావించారు.

**బడి గోసపడుతుంది**

మేము ఆడి పాడిన పాఠశాల మైదానం నేడు ఎడారిల తలపిస్తుంది. ఆడే పిల్లలు ఎవరూ లేక మేము కూర్చొని చదువుకున్న తరగతి గదులు మేడువారి పోయాయి పిల్లలు అల్లరి చప్పుడు లేక మా తరగతి గది బోర్డు గరుకు పట్టిపోయింది గాయపకు బొగ్గు దంచి తెచ్చి పెట్టే పిల్లలు కనబడక. మా చేతి మీద ఎర్రసార్కలు పెట్టిన కట్టే మూలకు కూర్చుని ములుగుతున్నది నా బాధ్యత కాలం చెల్లిపోయింది అని.

**బడుల బలోపేతంలో మనకు బాధ్యత లేదా**

ఈనాడు ఉన్న కొద్ది మంది విద్యార్థులతో గదికి ఇద్దరు ముగ్గురిని కూర్చోబెట్టలేక ఉన్న కొద్ది మంది ఉపాధ్యాయులతో సర్దుబాటు చేయలేక అందరిని ఒకే దగ్గర కూర్చోబెట్టి కలగలిపి పాఠాలు చెప్పడంలో కొత్త పరీక్షను ఎదుర్కొంటున్న నేటి తరం ఉపాధ్యాయులు అయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా కొద్ది మంది విద్యార్థుల భవిష్యత్తు కు భరోసామేమని తాపత్రయ పడుతున్న నేటితరం గురువులకు మనం ఎలా సహకరించగలం... ? మనబడిని ఎలా బ్రతికించుకోగలం...?

**ఏది విలువైన సంపద**

తాత ముత్తాతలు సంపాదించి పెట్టిన ఆస్తుల కాపాడుకోవడం కోసం తహతహలాడుతున్నాం. కానీ మన నుండి ఎవరు దోచుకోలేని విద్యాబుద్ధులతో మేదస్సు సంపదనిచ్చిన మనబడి ని కాపాడడం కోసం మనం ఏం చేస్తున్నాం....?

**విద్యార్థుల ప్రేమాభిమానాలతో అలసిపోతున్న ఉపాధ్యాయులు**

నిత్య ఆత్మీయ సమ్మేళనాలతో ఉపాధ్యాయులను ఆ బడి పిల్లలందరం రోజు ఒక ఫంక్షన్ హాల్ కు పిలుస్తూ. శాలువా కప్పి దండం పెడితే సరిపోతుందా రుణం తీరిపోతుందా?... గురువు హృదయం బరువెక్కుతోంది. మనము కప్పిన శాలువాలతో వేసిన దండాలతో కాదు. మనం చదివిన పాఠశాల ఎందుకు బోరున విలపిస్తుందో మనం ఆలోచించకపోవడం వల్ల వాళ్ల కష్టానికి ప్రతిఫలంగా మనకు జీవితాన్నిచ్చిన ప్రభుత్వ పాఠశాలను కాపాడకపోతే మన రుణం తీరిపోతుందా....?

ఆలోచించండి మిత్రులారా...

**లో... లో... తిమ్మప్ప... లోడు తేరా మల్లప్ప..... మర్చిపోలేనిది**

అన్ని తరగతుల విద్యార్థులందరినీ గ్రౌండ్లో రౌండ్ గా కూర్చోబెట్టి ఒక్కరిని లేపి వాళ్ల చేతికి సార్ తువ్వాలను లోడ్డులా పేని ఉరికిపిస్తూ విద్యార్థులు అందరి తో లో.. లో.. తిమ్మప్ప..లోడు తేరా మల్లప్ప.... అనే పాట పాడిపిస్తూ అది ఎవరి దగ్గర వేస్తే వాళ్ళు లేసి మల్ల పరిగెత్తడం ఆనాడు విద్యార్థులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేది. ఇట్లాంటి అనేక ఆటలు నాడు ఆడుకున్నాము మాకు మా ఉపాధ్యాయులు అట్లా ఆడించారు. అవన్నీ ఇప్పుడు కనుమరుగవుతు.. మైదానంలో ఆడాల్సిన ఆటలన్నీ సెల్ఫోన్లలో ఆడుతున్న రోజులు ఇవి రోజులు మారాయి నేడు టెక్నాలజీ అప్డేట్ అయ్యింది కానీ అది అభివృద్ధి కోసం వాడుకోవాలి తప్ప వినాశనానికి దారి చూపకూడదు సెల్ ఫోన్లు రావడంతో నేటి తరం పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారు.

**సౌకర్యాలు లేకపోయినా సమయానికి వచ్చే ఉపాధ్యాయులు**

కాలినడకన బడికి వచ్చే పంతులు నాడు..

సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేక పోయిన వర్షాకాలంలో ఉరుములు ఉరిమిన , మెరుపులు మెరిసిన మోకాళ్ళ దాకా పయింట్ మడుచుకొని ఒక చేతిలో టిఫిన్ , చెత్రీ మరో చేతిలో చెప్పులు పట్టుకొని వాగులు వంకలు దాటుకొని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మా కన్నా ముందే బడికి వచ్చే పంతులు మాకు ఉన్నారని చెప్పుకోవడం మాకు ఎంతో గర్వకారణం.

**మా ఊరికి తెలిసింది ఒకటే బడి అప్పుడు అది ప్రభుత్వ బడి**

ఇప్పుడు కొత్త కొత్త పేర్లతో టెక్నోలు , టాలెంట్లు, నారాయణ, చైతన్య పేర్లతో.. ప్రైవేట్, కార్పొరేట్ బడులు వచ్చి చదువును సంతలో వ్యాపారంగా మార్చాయి. కావున చదువు అనేది అందరి హక్కు కాబట్టి. చదువు అందరికీ అందుబాటులో ఉండాలని. ఒకటే విద్యా విధానం కొనసాగాలని అందుకు మనందరం కృషి చేయాలని మనందరికీ జీవితాన్నిచ్చిన ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం! పేద వర్గాల విద్యార్థుల జీవితాల్లో వెలుగును నింపుదాం!!

**- ఎర్ర మహేందర్**

**మీనపల్లి కలాన్. పూర్వ విద్యార్థి,**

**మాజీ విద్యార్థి సంఘం నాయకులు,**

**ప్రస్తుతం AIKMS జిల్లా అధ్యక్షులు.**



## రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్లో అర్చరి క్రీడలో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లిన విద్యార్థులు

**పటాన్చెరు , నవంబర్ 2 (డైలీ రిపోర్ట్):** రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్ బీరంగూడ రావుస్ విద్య సంస్థ నుండి అక్టోబర్ 27వ రోజున జరిగిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కొల్లూరు ప్రాంతంలో జరిగిన ఆర్చరి ఆటలో పాల్గొన 14 వయసు లోపు విద్యార్థులు 17 వయసు లోపు జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు.జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు. రావుస్ విద్యా సంస్థల నుండి ఎంపికైన విద్యార్థులు పేర్లు రెండవ బహుమతి, యమ్ గౌతమ్ సిల్వర్ మోడల్, మూడవ బహుమతి బి లోకేశ్వర్ బ్రాంచ్ మోడల్, పి హర్షవర్ధన్, కౌషిల్, నాలుగవ స్థానంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్స్ చైర్మన్ ప్రభాకర్ రావు, సీఈవో పి నిదిన్ రావు, డైరెక్టర్ పి కీర్తన ప్రిన్సిపల్ ఉమాకశా షెనాయ్, అర్చరి కోచ్ కపిల్ గౌడ్, స్పందన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థుల విజయాన్ని ప్రోత్సహిస్తూ ఇంకా ఉన్నత స్థాయిలో క్రీడా లకు తల్లిదండ్రులకు విజయాలు తెచ్చి కీర్తి ప్రతిష్టలు పెంచాలని తెలిపారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి - కొండాపురం జగన్



**సంగారెడ్డి, నవంబర్2 డైలీ రిపోర్ట్:** సంగారెడ్డి పట్టణంలో రాంచందర్ రెడ్డి నగర్ కాలనీలో 403 సర్వే నంబర్లు కొందరు ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు దీనిపై ఈరోజు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ని కలిసి విషయాన్ని క్లుప్తంగా వివరించి ప్రభుత్వ భూములను అన్నాకృతం కాకుండా కాపాడాలని బస్తి వాసులతో కలిసి తెలంగాణ అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు మరియు బిజెపి రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్ ఆధ్వర్యంలో అదనపు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ను కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది.

## ప్రవేట్ హాస్పటల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**అందించే సేవలకు తీసుకునే రుసుమును ధరల సూచికల బోర్డులు తప్పనిసరి లేకుంటే చర్యలు తప్పవు ..మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం**



మహబూబాబాద్, నవంబర్ 02(డైలీ రిపోర్ట్): మహబూబాబాద్ జిల్లాలో శనివారం రోజున మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు అన్నీ తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారు అందించే సేవలకు తీసుకునే రుసుమును, ప్రతి హాస్పిటల్ ఆవరణలో అందరికి కనిపించే విధంగా ధరల సూచికల బోర్డులను ప్రదర్శించాలని, ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, రోగ గ్రస్తులకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని, అవసర నిమిత్తమైన పరీక్షల రాయాలని, అనవసరమైన పరీక్షలు రాయకూడదని పేర్కొంటూ, హాస్పిటల్లో ఉన్న రికార్డులను ఐపి,ఓపి రిజిస్టర్ లను పరిశీలించడం జరిగింది. స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తూ, గర్భస్థలింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినట్లయితే, చేపట్టిన వైద్యాధికారికి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు, పీసీ %డ% పిఎన్డిటి యాక్ట్ 1994-1996 నిబంధనలను అనుసరించి మొదటి తప్పుకు 10 పదివేల జరిమానా మూడు 3 సంవత్సరాల జైలు శిక్ష, రెండవ తప్పుకు ఐదు 5 సంవత్సరాల జైలు శిక్ష ,50 వేల జరిమానా విధించబడుతుందని తెలిపారు. డాక్టర్ యొక్క పట్టా రద్దుకు సిఫారసు చేపడుతుందని హెచ్చరించారు. చట్ట విరుద్ధమైన అబార్షన్స్ నిర్వహించినట్లయితే అట్టి యాజమాన్యాల పైన, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ అనుసరించి చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కే.ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, యెల్. డి కంప్యూటర్ అరుణ్ కుమార్ పాల్గొనడం జరిగింది.



## రవిర్యాల గ్రామం లోసదరు ఉత్సవాలలో పాల్గొన్న మహేశ్వరం ఎంఎల్ఏ సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామంలో "నేతాజీ యువజన సంఘం" ఆధ్వర్యంలో యాదవుల సంస్కృతి సాంప్రదాయంలో భాగంగా జరుపుకునే సదరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇట్టి సదర్ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు శ్రీమతి పటోళ్ల సబితా ఇంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ యాదవ సోదరులకు సదర్ మరియు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దున్న రాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జల్లల లక్ష్మయ్య యాదవ్ స్థానిక కౌన్సిలర్ రెడ్డిగల సుమన్ ,బాట సురేష్ ,మీగడ రాజు ,శేఖర్ రెడ్డి, అశోక్, సుధాకర్ ,తిరుమలేష్, పొట్టోల్ల నరసింహ,బాట బిక్షపతి స్థానికయువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు



## తూముకుంట అంక్ష రెడ్డిని కలిసిన జిన్నారం గుమ్మడిదల్ మండల యువజన కాంగ్రెస్ నాయకులు

### భవిష్యత్ కార్యాచరణ పై సమీక్ష నిర్వహించిన

### రామచంద్రగుప్త గుమ్మడిదల్ మండల యువజన కాంగ్రెస్ నాయకులు

### జింక గణేష్ జిన్నారం మండల యువజన కాంగ్రెస్ నాయకులు



**సిద్దిపేట/జిన్నారం నవంబర్ 2(డైలీ రిపోర్ట్):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కంటెస్టెంట్ తూముకుంట అంక్ష రెడ్డి నీ గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ముక్కల రామచందర్ గుప్తా జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు జింక గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా చర్మానించడం జరిగింది. అనంతరం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకురాలుగా పోటీల్లో ఉన్నందుకుగాను పలు విషయాల పైన చర్చించడం జరిగింది, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా గెలుపొందిన వెంటనే యువజన కార్యక్రమాలు యువజన సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కార దిశగా కార్యక్రమాలను కొనసాగించుటకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నానని ఈ సందర్భంగా ఆంక్ష రెడ్డి తెలియజేయడం జరిగింది, జిన్నారం మండలం గుమ్మడిదల మండలం యువజన నాయకులు ముక్క రామచంద్ర గుప్తా, జింక గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అంచలంచలుగా అభివృద్ధి పరచుటకు నిరంతర కృషి చేయాలని యువజన విభాగాన్ని తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ముందు స్థాయిలో ఉంచాలని రాష్ట్రంలో సామాజిక కార్యక్రమాలతో పాటు యువజన కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకు పోవడం కోసం మా శక్తి వంచన లేకుండా పనిచేస్తూ గొప్ప విజయాన్ని సాధిస్తామని ఈ సందర్భంగా ఇరువురు అంశ రెడ్డి సమక్షంలో తెలియడం జరిగింది,రాష్ట్రంలో వివిధ జిల్లాల వారీగా యువజన విభాగం బలోపేతానికి విస్తృతస్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సూచించడం జరిగింది. స్టేట్ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ కంటెస్టెంట్ తూముకుంట ఆంక్షరెడ్డి గారిని కలిసిన గుమ్మడిదల జిన్నారం మండల యూత్ కాంగ్రెస్ కంటెస్టెంట్స్ ముక్కల రామచంద్ర గుప్తా మరియు జింక గణేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. స్టేట్ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ కంటెస్టెంట్ తూముకుంట ఆంక్షరెడ్డి గారిని కలిసిన గుమ్మడిదల జిన్నారం మండల యూత్ కాంగ్రెస్ కంటెస్టెంట్స్ ముక్కల రామచంద్ర గుప్తా మరియు జింక గణేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

# కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం చేస్తున్న ఇచ్చోడ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ గురుకులం పాఠశాల విద్యార్థులు..



**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ గురుకులం పాఠశాల విద్యార్థులు ప్రభుత్వం గురుకులాల్లో విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం హర్షణీయమని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ అన్నారు శనివారం విలేకరుల సమావేశంఏర్పాటు చేసి మాట్లాడుతూ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క బీసీసంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్కి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఈ పెంచిన చార్జీలు నవంబర్నుండి అమలు చేస్తూ ఉత్తర్వులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. 3వ తరగతి నుంచి 7వతరగతి వరకు ప్రస్తుతం రూ. 950గా ఉన్న డైట్ చార్జీలను రూ. 1330కి పెంచారు. అలాగే 8 నుంచి10వ తరగతి వరకు రూ. 1100 నుంచి రూ. 1550కు, ఇంటర్ నుంచి పీజీ వరకు డైట్ చార్జీలను రూ.1500 నుంచి రూ.2100కు పెంచారన్నారు. దీంతో పాటు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచారనితెలిపారు. ఈ డైట్ చార్జీల పెంపుతో పిల్లలకు మరింతగా పోషకాలు అంది ఆరోగ్యానికి దోహదంచేస్తుందన్నారు.

# తాళ్ళ పేరుతో ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

### ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన ఇంటర్మీడియట్ గోడౌన్ లను గుర్తించాలి

### ధాన్యం కొనుగోలు పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**మహబూబాబాద్. నవంబర్ 02(డైలీ రిపోర్ట్):** మహబూబాబాద్ జిల్లాలలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం దాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలు పై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోలు పై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహన్ అధికారులకు సూచించారు. తాళ్ళ పేరుతో ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేదు మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్ధవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు.ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. సన్న రకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ 500 రూపాయల బోనస్ ప్రకటించిందని తెలిపారు.జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం దాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని,కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామాగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు రకం ధాన్యం సన్న రకం కోనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో రైస్ మిల్లర్ల వద్ద తాళ్ళు పేరుతో ఎటువంటి ధాన్యం కోతలు జరగవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని, రైతుకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని మంత్రి సూచించారు. రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీఓ 27 పై చర్చించాలని, రైస్ మిల్లర్లచే బ్యాంక్ గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చని అన్నారు.రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గో డౌన్ సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్ తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా బార్డర్ల వద్ద చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

**రైతులకు ఇబ్బందులు కలగవద్దు : జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు 27 పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించామని, ముందుగా రైస్ మిల్లర్లు అండర్ టేకింగ్ సమర్పించి తర్వాత బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని సమాచారం అందించామని అన్నారు. ఇబ్బంది లేకుండా సమర్ధవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డిసిఓ వెంకటేశ్వర్లు, డి.ఎ.ఓ వసంత, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, లీగల్ మెట్రాలజీ అధికారి విజయ్ కుమార్, ఆ.ర్.టి.ఓ భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డల రక్షణలో కూటమి వైఫల్యం..!

**జయ కళ్యాణి ఆకుల, భారత చైతన్య యువజన పార్టీ.**

ఆంధ్రప్రదేశ్ ,నవంబర్ 02(డైలీ రిపోర్ట్): షర్మిల కి రక్షణ కల్పించే బాధ్యత నేను తీసుకుంటాను అని అంటున్న డీసీఎం పవన్ కళ్యాణ్ కి ఒక పార్టీ అధ్యక్షురాలు మాత్రమే ఆడబిడ్డలా కనిపిస్తున్నారా ? మరి రాష్ట్రంలో ఉన్న సాధారణ ఆడబిడ్డల రక్షణ మాటేమిటి ? మా రక్షణ ఎవరి బాధ్యత పవన్ కళ్యాణ్ కు కనిపించడం లేదా? రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..!? ఆడబిడ్డలకు రక్షణ ఉందా..!? అంటూ జయ కళ్యాణి ఆకుల, భారత చైతన్య యువజన పార్టీ తరపున ఆమె ప్రశ్నించారు.

# నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అకస్మాత్తుగా ఇచ్చోడ మండల హాస్టలల్లో సుడిగాలి పర్యటన..!!





**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రల లో ని టి టి డబ్ల్యూ ఆర్ (హాస్టల్ సాంఘిక సంక్షేమ హాస్టల్ మైనారిటీ హాస్టల్ లో 40% డైట్, కాస్మెటిక్ చార్జిల గురించి తెలుసుకున్నారు తెలంగాణ రాష్ట్రం లో అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజాపాలన నడుస్తుంది. విద్య ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగు పరచడానికి అనేక రకల సకల సౌకర్యాలు కల్పిస్తున్నారని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ కార్యక్రమం లోబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమూద్ ఖాన్ ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కళ్లెం నారాయణ రెడ్డి స్టేట్ ఎస్టీ సేల్ వైస్ ప్రెసిడెంట్ కొమరం కొటేష్ సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ ఇమామ్ బోథ్ నియోజవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ కొత్తూరు లక్ష్మణ్. బోథ్ నియోజవర్గ మైనార్టీ చైర్మన్ షేక్ ముస్తఫా సీరిచేల్మ ఉప సర్పంచ్ అబ్దుల్ అజీమ్ సీనియర్ నాయకులు చోలే ప్రభాకర్ చవాన్ శేషారావు షఫీ అహ్మద్ ఆశన్న గ మధుకర్ , ప్రవిన్ పాటిల్ షెక్ మహబుబ్ , మల్యాల సర్పంచ్ రాజు , రాజేశ్వర , క్రాంతి కిరణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# దొంతాన్ పల్లిలో ఐడియల్ కిచెన్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క

శంకర్‌పల్లి: నవంబర్ 02: (డైలీ రిపోర్ట్): శంకర్పల్లి మండల పరిధిలోని దుంతాన్ పల్లి గ్రామ శివారులో గల ఐబీఎస్ కాలేజీ ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన ఐడియల్ కిచెన్ ను రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి సీతక్క శనివారం రిబ్బన్ కట్ చేసి, లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధిలో రాణించాలని సూచించారు. ఐడియల్ కిచెన్ ను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. ఐడియల్ కిచెన్ యాజమాన్యం మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు జ్యోతి, మండల, మున్సిపల్ వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707